క్లుప్తంగా

మహిళలకు సారె పంపిణీ



రామాలయం వద్ద మహిళలకు సారె పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: తూర్పుపేట రామాలయం వద్ద మహిళా భక్తులకు సారె పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. 65 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ సీతారామ లక్ష్మణ సమేత హనుమద్ ఆలయంలో సంవత్సరం నుంచి ప్రతి మంగళవారం 50 మందికి పైగా మహిళలు పారాయణ నిర్వహిస్తున్నారన్నారు. వీరినందరినీ సత్కరించాలనే ఉద్దేశ్యంతో ఆలయ కమిటీ సభ్యులు మహిళలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పసుపుకుంకుమలు, మట్టి గాజులతో పాటుగా వస్త్రాలను సారెగా సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బెల్లాన శ్రీనివాస్, కార్యదర్శి రౌతు శ్రీను, కరోతు నారాయణరావు, బెల్లాన సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై జబీర్

జంగారెడ్డిగూడెం: పట్టణంలో గురువారం రాత్రి పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. స్థానిక మసీదు సెంటర్‌లో ఎస్సై షేక్ జబీర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జబీర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహన తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. పట్టణంలో త్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి, అతి వేగంగా వాహనాన్ని నడుపుతూ చేసే చర్యలను మానుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలతో పాటు, చట్ట ప్రకారం కఠిన శిక్షలు అమలు చేయడానికి కూడా వెనుకాడబోమని తెలిపారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లితండ్రులకు సూచించినట్లు తెలిపారు.

లారీ డ్రైవర్లకు కౌన్సెలింగ్



లారీ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

కుక్కునూరు: లారీ డ్రైవర్లు ఇసుక లోడుతో వెళ్లేటప్పుడు జాగ్రత్త వహించాలని పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు డ్రైవర్లకు సూచించారు. సోమవారం ఆయన ఇసుక స్టాక్ పాయింట్‌కు వచ్చే లారీ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట ఇసుక స్టాక్ పాయింట్ వద్దకు ఇసుక లోడింగ్ కోసం వచ్చే లారీ డ్రైవర్లు వారి వాహనాలను జాగ్రత్తగా, రోడ్డు మీద పోయేప్పుడు ఇతరులకు ఇబ్బంది కలగకుండా, నెమ్మదిగా వెళ్లాలన్నారు. నిర్లక్ష్యంగా వేగంగా నడిపిన డ్రైవర్లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ రమేష్, ఎస్సై రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి ఆర్జిత సేవలు రద్దు

ద్వారకాతిరుమల: కృష్ణాష్టమి సందర్భంగా శ్రీవారి ఆలయంలో మంగళవారం నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. అలాగే బుధవారం క్షేత్రంలో ఉట్టి పండుగను, స్వామి వారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని, భక్తులు గమనించాలని ఆయన కోరారు.

మనస్తాపంతో చేతులపై కోసుకున్న వ్యక్తి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగేంద్ర

జంగారెడ్డిగూడెం రూరల్: భార్య పుట్టింటికి వెళ్లిపోయిందనే మనస్తాపంతో ఒక వ్యక్తి బ్లేడుతో శరీరంపై గాయాలు చేసుకున్న ఘటన మండలంలోని శ్రీనివాసపురంలో చోటు చేసుకుంది. మోటూరి నాగేంద్ర, అతని భార్య ప్రసన్నల మధ్య ఆదివారం రాత్రి గొడవ తలెత్తింది. దీంతో ప్రసన్న పుట్టిల్లు అయిన కామవరపుకోట మండలం గద్దేవారిగూడెం వెళ్లిపోయింది. భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని మనస్తాపానికి గురైన నాగేంద్ర చేతులపై బ్లేడుతో కోసుకుని గాయపర్చుకున్నాడు. బంధువులు, కుటుంబ సభ్యులు నాగేంద్రను జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.



సుప్రీంకోర్టు సూచనలు కచ్చితంగా అమలు చేయాలి



మహిళా వైద్యుల రక్షణకు సుప్రీంకోర్టు సూచనలు కచ్చితంగా ప్రభుత్వాలు అమలు చేస్తే కలకత్తా వైద్య విద్యార్థినిపై జరిగిన దుర్ఘటన పునరావృతం కాకుండా ఉండడానికి అవకాశం ఉంది. కోల్‌కతా దుర్ఘటనకు కారణమైన నిందితుడు సంజయ్ రాయ్ పాలిగ్రాఫ్ పరీక్షలో వైద్య విద్యార్థినిని తాను చూసే సరికే చనిపోయిందన్నాడని ప్రచారం జరుగుతుంది. పాలిగ్రాఫ్ టెస్టులను బహిర్గతం చేయాలి.

– డాక్టర్ కె.విజయ కృష్ణ, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, విజయవాడ

కఠిన చట్టాలు అమలు చేయాలి



వైద్యులు, వైద్య సిబ్బందికి ఆసుపత్రి ప్రాంగణంలో సౌకర్యాలు కల్పించాలి. కలకత్తాలో ట్రైనీ డాక్టర్ హత్యాచారం చాలా బాధాకరం. ఇటువంటి ఘటనలు నివారించాలంటే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. అత్యవసర రక్షణ కోసం సాంకేతికతను వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలి. నిస్వార్థ సేవలు అందించే వైద్యులు, సిబ్బందిపై దాడులు అరికట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి.

– డాక్టర్ ఎస్ఎస్ఆర్‌పీ స్వామి, ఆర్థోపెడిక్, జంగారెడ్డిగూడెం

పడకేసిన పారిశుద్ధ్యం

- డంపింగ్ యార్డులు లేక రోడ్లపైనే చెత్త వేస్తున్న వైనం
- విజృంభిస్తున్న వ్యాధులు



చింతలపూడి: డంపింగ్ యార్డు లేక రోడ్డు పక్కన చెత్త పోసి తగలబెడుతున్న దృశ్యం

చింతలపూడి: వర్షాలు తగ్గు ముఖం పట్టాయి. దీంతో పారిశుద్ధ్యం పడకేసింది. డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధాలు వెదజల్లుతున్నాయి. దీంతో దోమలు పెరిగి, జ్వరాలతో పట్టణాలు, గ్రామాలు అల్లాడుతున్నాయి. ప్రధానంగా చింతలపూడి నగర పంచాయితీ నుంచి కొన్ని ప్రధాన రహదారులపై ప్రయాణించాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సిందే. కారణం పట్టణంలోని చెత్త, చెదారం ఈ రోడ్లపై పోస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. ముఖ్యంగా టి.నరసాపురం వెళ్లే రహదారిపై టన్నుల కొద్దీ చెత్త పోస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక వారానికి ఒక సారి ఈ చెత్తను తగల బెడుతుండటంతో ఆ సమయంలో వచ్చే పొగ, వేడి గాలులకు ప్రజలు నరకం చూస్తున్నారు. నగర పంచాయతీకి సరైన డంపింగ్ యార్డు లేదు. దీంతో ప్రతీ రోజు వచ్చే టన్నుల కొద్దీ చెత్తను ఎక్కడ పోయాలో అధికారులకు అర్థం కావడం లేదు. నగర పంచాయతీతో పాటు గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డులు లేక చెత్తను రోడ్లపై పోస్తున్నారు. వీటిల్లో పందులు చేరి అంటు వ్యాధులకు కారణమవుతున్నాయి. కనీసం బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ చేయించడంపై అధికారులు శ్రద్ధ వహించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అదే విధంగా గ్రామాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక పోవడంతో మురుగు నీరు బయటికి పోయే దారి లేక గ్రామాల్లో అపారిశుద్ధ్యం తాండవిస్తుంది.

జంగారెడ్డిగూడెం మండలంలో

మండలంలో అనేక పంచాయతీల్లో అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. 20 పంచాయతీలు ఉండగా, కొన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్నా, ఎక్కువ పంచాయతీల్లో పనులు చేపట్టడంలో పంచాయతీ అధికారులు అలసత్వం వహిస్తున్నారు.



కామవరపుకోట: చెత్తాచెదారంతో మురుగు నీరు పెరిగిపోయిన దృశ్యం



ద్వారకాతిరుమల: రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త, చెదారం

దీంతో ఎక్కడ వ్యాధులు వ్యాపిస్తాయోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

మెట్ట ప్రాంతంలో విష జ్వరాలు విజంభిస్తున్నాయి. నెల రోజులకు పైగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు, వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా పిల్లలు, పెద్దలు జ్వరాల బారిన పడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. టైఫాయిడ్, మలేరియా, వైరల్ విష జ్వరాలతో ఆసుపత్రుల వద్ద బారులు తీరుతున్నారు. పారిశుద్ధ్యం లోపించిన కారణంగానే దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణాల్లో మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడం, మండలంలోని పారిశుద్ధ్యం అంతంత మాత్రంగానే ఉందని చెప్పవచ్చు.

అధ్వానంగా పారిశుద్ధ్యం

ద్వారకాతిరుమల: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా ద్వారకాతిరుమల క్షేత్రంలో, ప్రధాన రహదారులు, వీధి రోడ్ల వెంబడి చెత్తా చెదారం పేరుకుపోయింది. స్థానిక పంచాయతీ పార్కు ఎదురుగా ఉన్న రహదారి పక్కన, అలాగే రాణి చిన్నయమ్మారావు పేటలో రోడ్డు పక్కన ఇలా పలు కూడళ్ల చెత్తతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. ఆ ప్రాంతాలు తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. అదేవిధంగా ఎస్సీ కాలనీ, వసంత్‌నగర్ కాలనీల్లో డ్రైనేజీలు సక్రమంగా లేక మురుగునీరు నిలిచిపోయి దోమల బెడద ఎక్కువయ్యిందని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి సారించాలి



ప్రస్తుత ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. వర్షాలు ఎక్కువగా కురవడంతో గ్రామాల్లో దోమలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం నిధులు కేటాయించి, ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండా చేపట్టాల్సిన కార్యక్రమాలకు వెచ్చించాలి. దోమల నివారణకు చర్యలు చేపట్టడంతో పాటు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్యశాఖ పని చేయాలి.

దోరేపల్లి విజయ్, అక్కంపేట

పారిశుద్ధ్యం మెరుగుపరచాలి



వర్షాల కారణంగా గ్రామాల్లో చెత్త, చెదారం పేరుకుపోయి, కుళ్లి దుర్వాసన వస్తుంది. చాలా గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక మురుగునీరు నిల్వ ఉండి దోమలు విపరీతంగా పెరిగాయి. దీంతో ప్రతి గ్రామంలో ఎక్కువగా మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. అధికారులు స్పందించి ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరచాలి.

– మేరుగు బాబురావు, కొత్తూరు, కామవరపుకోట మండలం

పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలి

కామవరపుకోట: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఏకీకృత పింఛన్ స్కీమ్ (యూపీఎస్)ను వ్యతిరేకిస్తున్నట్లు బహుజన టీచర్స్ అసోసియేషన్ కామవరపుకోట మండలం అధ్యక్షుడు కస్సే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి రఘునాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వం యూపీఎస్‌ను ప్రవేశ పెట్టిందన్నారు. పాత పెన్షన్ పథకానికి యూపీఎస్ ప్రత్యామ్నాయం కాదని తెలిపారు. పాత పెన్షన్ పథకాన్ని పూర్తిగా పునరుద్ధరించాలని, పీఎఫ్ ఆర్డీఏ రద్దు చేయాలని, 10 శాతం జీతం తగ్గింపును నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు.

నూతన సీఐ బాధ్యతల స్వీకరణ



సీఐ రవీంద్ర నాయక్

చింతలపూడి: పట్టణ సీఐగా రవీంద్ర నాయక్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలో సీఐగా పని చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో ఆయన కాకినాడ, ఏలూరు పట్టణాల్లో పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్‌లో శాంతి భద్రతల పరి రక్షణకు కృషి చేస్తానన్నారు. కోడిపందాలు, పేకాట జూదాలపై కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలు నేరాల అదుపునకు సహకరించాలని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో 12 మందిని అరెస్టు చేసి, రూ.15,800 నగదు, 8 బైక్‌లు, 3 కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

కృష్ణం వందే జగద్గురుం



ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



కృష్ణుడి వేషధారణలో చిన్నారులు

- ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- కృష్ణుడి వేషధారణలో అలరించిన చిన్నారులు

కొయ్యలగూడెం: కృష్ణాష్టమి వేడుకలు సోమవారం మండల వ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహించారు. కొయ్యలగూడెంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమం ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని గోశాల వద్ద చిన్నారులకు వేషధారణ పోటీలు నిర్వహించి, విజేతలకు ఆలయ కమిటీ చైర్మన్ ముద్దు గోపి బహుమతులను అందజేశారు.

ద్వారకాతిరుమల: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా చిన్నారులు బాలకృష్ణుడు, గోపికల వేషధారణలతో కనువిందు చేశారు.

జంగారెడ్డిగూడెం: చత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా కృష్ణాష్టమి సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని బాల గోకులం పేరిట శ్రీకృష్ణ వేషధారణ పోటీలు సోమవారం నిర్వహించారు. అనంతరం పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహించినట్లు పరిషత్ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో విశ్వశాంతి పరిషత్ ప్రాంత కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్, విశ్వహిందూ పరిషత్ ఏలూరు జిల్లా అధ్యక్షులు కాకి సురేష్ కుమార్, పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు చిన్ని రామ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

కుక్కునూరు: కృష్ణాష్టమి వేడుకలు మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కేజీబీవీ పాఠశాలలో కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులు గోపికల, శ్రీకృష్ణుడి వేషధారణలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ భగవద్గీత మానవ జీవనశైలికి మార్గదర్శకంగా ఎప్పటికీ నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి.

బుట్టాయగూడెం: శ్రీకృష్ణ పరమాత్ముడు సకల జనావళికి ఆదర్శ మూర్తి అని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకొని సోమవారం రాత్రి దొరమామిడి శ్రీకృష్ణ ఆలయంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాణ పురుషుడిగా పూజలందు కోవడమే గాక భగవద్గీత ప్రభోధంతో మానవ మనుగడ ఏ విధంగా ఉండాలి అనేదానికి మార్గదర్శకత్వం వహించిన మహోన్నత వ్యక్తి అన్నారు. శ్రీకృష్ణుడి వేషధారణలో ఉన్న చిన్నారులతో ఆయన గడిపి బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్నారు.

టి.నరసాపురం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. టి.నరసాపురం, బొర్రంపాలెం, బండివారిగూడెం, మక్కినవారిగూడెం, వీరభద్రవరం తదితర గ్రామాల్లో ప్రజలు వేడుకల్లో పాల్గొన్నారు. బొర్రంపాలెం, బండివారిగూడెంలో అన్నసమారాధన నిర్వహించారు. అలాగే మేళ తాళాలు, కోలాట నృత్యాలతో స్వామి వారిని ఊరేగించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకు పంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీవరత్నం

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వ పోరంబోకు భూములు, ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం జంగారెడ్డిగూడెం మండల కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్థానిక సీపీఎం కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. అందుగుల ప్రభాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడుతూ మండలంలోని పంగిడిగూడెం, గుర్వాయిగూడెం, కేతవరం, పట్టిన్నపాలెం, ఎ.పోలవరం, తాడువాయి, వేగవరం, చక్రదేవరపల్లి గ్రామాల్లో ప్రభుత్వ పోరంబోకు, లాండ్ సీలింగ్ భూములు, ఎర్రకాలువ ప్రాజెక్టు మిగులు భూములు ఉన్నాయన్నారు. సమగ్ర సర్వే చేసి భూములను పేదలకు పంపిణీ చేయాలన్నారు. ఆయా భూముల్లో అధికారుల అండదండలతో భూస్వాములు సాగులో ఉన్నారని, వారి నుంచి భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని రైతు పొలాల్లో పని చేసే లాగా రైతులకు అనుసంధానం చేయడానికి ప్రతిపాదనలు చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ ప్రతిపాదనలను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి నిర్మాణాలు చేపట్టాలన్నారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు జి.సూర్యకిరణ్, జోడే సూర్యచంద్రరావు, యాగంటి సీత, బొడ్డు రాంబాబు, గరికి రాంబాబు, ఎం.ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు సహకారం



సమావేశంలో నూతన సభ్యులకు సభ్యత్వం అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: మానవత నెల వారీ సమావేశం జంగారెడ్డిగూడెంలో సోమవారం నిర్వహించారు. మానవత అధ్యక్షుడు అయినాల వెంకట రమణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సభ్యులు సెప్టెంబర్‌కు సంబంధించిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ మండలంలో ఎవరైనా మృతి చెందితే వారి ఇంటికి వెళ్లి మానవత సంస్థ ఆత్మీయ సహకారం అందించాలని తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి, మదర్ థెరిస్సా జయంతి శుభాకాంక్షలు తెలిపారు. జంగారెడ్డిగూడేనికి చెందిన ప్రముఖ బట్టల వ్యాపారి కందులపాటి సురేష్ కుమార్ వారి కుటుంబ సభ్యత్వం రూ.1,200 చెల్లించి సభ్యులుగా చేరారు. వీరికి రీజియన్ చైర్మన్ త్రిపుర రమేష్ సభ్యత్వం రశీదు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మహంకాళి రంగప్రసాద్, మానవతా మండల చైర్మన్ ఆకుల ధర్మరాజు, జాయింట్ సెక్రటరీ పల్లి వెంకటరెడ్డి, ఆడిట్ కమిటీ చైర్మన్ దల్లి కేదారేశ్వరరెడ్డి, సభ్యులు దల్లి రామాంజనేయరెడ్డి, భరద్వాజ రామకృష్ణ, ఆత్మీయ సహకార కమిటీ కన్వీనర్ గద్దె సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో ఆటల పోటీలు

ఏలూరు రూరల్ : ఈ నెల 29 జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురష్కరించుకుని చేపట్టిన ఆటల పోటీల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులు, యువతీ, యువకులు పాల్గొనాలని డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో క్రీడాకారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఫిట్ ఇండియా మొబైల్ యాప్ ద్వారా విద్యార్థులకు ఆరోగ్యం, వ్యాయామం పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. స్పోర్ట్ అథారటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు 27, 28 తేదీల్లో ఏలూరులో బాస్కెట్‌బాల్, పుట్‌బాల్, హేండ్‌బాల్, స్కేటింగ్, రన్నింగ్, వాకింగ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 29న భారీ ర్యాలీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పలు క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, పీడీలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మదర్ థెరిస్సా జయంతి

కొయ్యలగూడెం: మదర్ థెరిస్సా 114వ జయంతి కార్యక్రమం కన్నాపురం రోడ్డులోని థెరిస్సా విగ్రహం వద్ద సోమవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నాయకులు మడుతూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొని మదర్‌థెరిస్సా సేవల గురించి కొనియాడారు. థెరీస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూలపల్లి రవికుమార్, మేడిన కన్నయ్య, మామిడి ప్రేమ్ కుమార్, ఎస్.వెంకటేష్, ఆకునూరి నరసయ్య, అన్నవరం, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట: కొత్తూరు మదర్ థెరిస్సా యూత్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతి ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ మాతృమూర్తి మదర్ థెరిస్సా అని, ఎంతోమంది అనాథల జీవితాల్లో వెలుగును నింపారన్నారు. కార్యక్రమంలో వెలగలేటి సుందరాకాండ, మేడంకి జీవన్ లక్ష్మణ్, టోకూరి విజయకుమార్, మానుకొండ బాబురావు, తైదల సుందరావు, కుచ్చులపాటి ప్రతాప్, వెంకటేశ్వరరావు, సకలాబత్తుల శేఖర్, బిరుదుగట్ల సుభాకర్, చింతపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.



కొయ్యలగూడెం: మదర్ థెరిస్సా విగ్రహం వద్ద జయంతి నిర్వహిస్తున్న దృశ్యం



కామవరపుకోట: మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు